సాక్షి
నిజామాబాద్

ఆదివారం । 31 । మార్చి । 2024



నగరంలో పరీక్షలు ముగిసిన ఆనందంలో విద్యార్థినులు

పరీక్షలు ముగిశాయ్..

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 18న ప్రారంభమైన పరీక్షలు శనివారంతో పూర్తయ్యాయి. పరీక్షల్లో ఒక్కరు కూడా డిబార్‌ కాలేదు. పరీక్షలు సజావుగా సాగడానికి సహకరించిన అధికారులు, సిబ్బందికి డీఈవో దుర్గాప్రసాద్‌ ధన్యవాదాలు తెలిపారు.



న్యూస్‌రీల్‌

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: జిల్లా కేంద్రంలోని బోధన్‌ రోడ్డులో ఉన్న అర్సపల్లి రామర్తి చెరువు ఆక్రమణల తొలగింపు కొనసాగుతోంది. ఈ నెల 28న 'సాక్షి'లో ప్రచురితమైన 'చెరువులకు ఎసరు!' అనే కథనం ప్రకంపనలు సృష్టించింది. దీంతో అధికార యంత్రాంగం స్పందించింది. మొదటి రెండు రోజులు చెరువు పశ్చిమ భాగంలో ఆక్రమణలు తొలగించిన అధికారులు మూడో రోజు తూర్పు వైపు భాగంలో తొలగింపులు షురూ చేశారు. రెవెన్యూ, మున్సిపల్, పోలీసులు అధికారులు నిరంతరం అక్కడే ఉండి పనులు పర్యవేక్షిస్తున్నారు. చెరువును పునరుద్ధరించడంతో పాటు ఆక్రమణలకు బాధ్యులైనవారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు తెలిపారు.

రెండు రైళ్ల నిలిపివేత

బోధన్‌టౌన్‌: బోధన్‌కు నెల రోజుల పాటు రైళ్ల రాకపోకలు నిలిచిపోనున్నాయి. మరమ్మతుల కారణంగా రెండు రైళ్లను నిలిపివేసినట్లు స్టేషన్‌ మాస్టర్‌ రాము తెలిపారు. బోధన్‌–మహబూబ్‌ నగర్‌ ప్యాసింజర్‌ రైలు ఏప్రిల్‌ 2 నుంచి మే 1 వరకు, గుంతకల్‌–బోధన్‌ ప్యాసింజర్‌ రైలు ఏప్రిల్‌ 1 నుంచి 30 వరకు నిలిపి వేశారని తెలిపారు.

శిక్షణకు ఈవీఎంల కేటాయింపు



సుభాష్‌నగర్‌: పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్‌ అధికారులు, సహాయ పోలింగ్‌ అధికారులకు ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ యంత్రాల పనితీరుపై శిక్షణ అందించనున్నారు. దీనికోసం శనివారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్‌ నుంచి ఆయా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలకు ఈవీఎంలను కేటాయించారు. కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్‌ కిరణ్‌ కుమార్‌ పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను కేటాయించారు. బోధన్‌ ఆర్డీవో రమేశ్‌రాథోడ్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్‌ పాల్గొన్నారు.

2న సైబర్‌ క్రైం ఠాణా ప్రారంభం

ఖలీల్‌వాడి: నగరంలో సైబర్‌ క్రైం పోలీస్‌ స్టేషన్‌ను ఏప్రిల్‌ 2న ప్రారంభిస్తున్నట్లు ఏసీపీ వెంకటేశ్వర్‌ రావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.లక్షకు పైబడి సైబర్‌ నేరంలో పోగొట్టుకుంటే ఈ ఠాణాలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. రూ.లక్షకు తక్కువ ఉంటే స్థానిక పోలీస్‌ స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని ఆయన తెలిపారు.

మున్సిపాలిటీలకు నిధులు

నిజామాబాద్‌నాగారం: తాగునీటి సమస్య పరిష్కారానికి జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. నాలుగు మున్సిపాలిటీలకు రూ.1.71కోట్లను మున్సిపల్‌ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు విడుదల చేశారు. వీటిని తాగునీటి ఎద్దడి నివారణకు వినియోగించాలని ఆదేశించారు.

విడుదలైన నిధులు

మున్సిపాలిటీ	నిధులు
నిజామాబాద్‌	రూ.96.30 లక్షలు
బోధన్‌	రూ.52.44 లక్షలు
ఆర్మూర్‌	రూ.18.24 లక్షలు
భీమ్‌గల్‌	రూ.4.19 లక్షలు

వైద్యాధికారిపై విచారణ

డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన ఉన్నతాధికారులు

- ఫిర్యాదుదారును బెదిరించే ప్రయత్నం చేసిన విచారణాధికారి
- ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో వెనక్కి తగ్గిన వైనం
- జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌పై విచారణకు ఆదేశించిన కలెక్టర్‌
- ప్రతిమారాజ్‌ అవినీతిపై ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌ గౌడ్‌ గుర్రు

జిల్లాలో కీలకమైన ప్రజాప్రతినిధులు ఒక్కొక్క ప్రభుత్వ శాఖను ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే జిల్లా సహకార శాఖలో మాజీ డీసీవో చేసిన అవినీతిపై విచారణ చేయిస్తున్నారు. తాజాగా వైద్య ఆరోగ్య శాఖ, ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రిలోని అవినీతి, అక్రమ వ్యవహారాలను నిగ్గుతేల్చే పనిలో పడ్డారు. ఎన్నికల కోడ్‌కు ముందే ఈ శాఖల్లోని అవకతవకలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఇందులో భాగంగా ఉన్నతాధికారులు విచారణను షురూ చేశారు.



డీఎంహెచ్‌వో అవినీతిపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలు



జీజీహెచ్‌లో అక్రమాలపై 'సాక్షి'లో వచ్చిన కథనాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుదర్శనం వచ్చే నెలలో రిటైర్‌ కానున్నారు. ఈ క్రమంలో సుదర్శనం అనేక వ్యవహారాల్లోని బాధితుల్లో ఒకరైన సమీర్‌ డైరెక్టర్‌ ఆఫ్‌ హెల్త్‌కు గతంలో ఫిర్యాదు చేశాడు. కొత్త ప్రభుత్వం వచ్చాక జిల్లా ప్రజాప్రతినిధులు సైతం నజర్‌ పెట్టారు. కాగా గతంలో 'సాక్షి'లో సమాచార హక్కు చట్టం ద్వారా తీసుకున్న వివరాలతో అధి'కార్ల' దోపిడీ, '15 ఏళ్ల జీ(వి)తాన్ని అప్పనంగా మెక్కేశారు', 'డీజిల్‌ కూపన్ల దుర్వినియోగం', 'ప్రమోహన్‌ వచ్చినా రిలీవ్‌ చేయరట..!' అనే కథనాలను ప్రచురితం చేసింది. ఈ కథనాలను జతచేసిన సమీర్‌ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశాడు. దీంతో డైరెక్టరేట్‌ ఆఫ్‌ హెల్త్‌ విభాగం నుంచి జాయింట్‌ డైరెక్టర్‌ అంబర్‌సింగ్‌ శనివారం విచారణ చేపట్టారు.

■ డీఎంహెచ్‌వో సుదర్శనంపై విచారణకు వచ్చిన జేడీ అంబర్‌సింగ్‌ ఫిర్యాదుదారు సమీర్‌ను బెదిరింపులకు గురి చేయడం గమనార్హం. వచ్చే నెలలో డీఎంహెచ్‌వో రిటైర్‌మెంట్‌ ఉందని, ఫిర్యాదును వెనక్కు తీసుకోవాలని అంబర్‌సింగ్‌ ఒత్తిడి చేసినట్లు సమీర్‌ 'సాక్షి'కి తెలిపారు. ఈ క్రమంలో నువ్వెంత.. నీ లెక్కెంత అంటూ మాట్లాడినట్లు సమీర్‌ వాపోయాడు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తానని ఫిర్యాదుదారు చెప్పడంతో విచారణాధికారి వెనక్కు తగ్గారు.

■ ఓనర్‌ కం డ్రైవర్‌ పథకానికీ డీఎంహెచ్‌వో తూట్లు పొడిచారు. ప్రభుత్వ ఉద్యోగుల, వారి బంధువులకు చెందిన వాహనాలను అద్దె ప్రాతిపదికన పెట్టుకోకూడదనే నిబంధన తుంగలో తొక్కి, నిరుద్యోగుల ఉపాధికి ఎసరు పెట్టారు. కార్లు, అంబులెన్స్‌లు, టీ.హబ్‌ (శాంపిల్స్‌ తీసుకెళ్లే వాహనాలు) బినామీ పేర్లతో పెట్టుకుని ప్రతినెల వాహనం తిరిగినదానికంటే అదనంగా డబ్బులు దండుకున్నారు. మరోవైపు నిరుద్యోగుల వాహనాలకు చెల్లింపులు చేయకుండా తిప్పలు పెట్టారు. జిల్లాలో కోవిడ్‌ సమయంలో 2020 మార్చి నుంచి 2020 ఆగస్టు వరకు నిరుద్యోగులు తిప్పిన వాహనాలకు సంబంధించి మొత్తం 15 మందికి 1,06,070 కిలోమీటర్లకు గాను రూ.15,91,050 ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఉద్యోగుల బినామీల వాహనాలకు అడ్వాన్సులు చెల్లించడం విశేషం.

■ డిచ్‌పల్లి మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన సమీర్‌ హైమద్‌ అనే ఓనర్‌ కం డ్రైవర్‌ కోవిడ్‌ సమయంలో అద్దె ప్రాతిపదికన నేషనల్‌ హెల్త్‌ మిషన్‌ ద్వారా రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం కింద తన వాహనం తిప్పాడు. ఇతని వాహనాన్ని 14,630 కిలోమీటర్లు తిప్పుకున్నారు. ఇందుకు గాను ఇవ్వాల్సిన రూ.2,19,450 లను చెల్లించకుండా డీఎంహెచ్‌వో ఇబ్బందులు పెట్టారు. దీంతో సమీర్‌ నవంబర్‌ 18, 2022న సమాచార హక్కు చట్టం కింద చెల్లింపులకు సంబంధించిన వివరాలు అడిగాడు. సమాచారం ఇవ్వకపోగా తనను కార్యాలయానికి పిలిపించి దాడి చేయించినట్లు సమీర్‌ తెలిపాడు. పైగా తన వాహనం అద్దె కాంట్రాక్ట్‌ను రద్దు చేసినట్లు వాపోయాడు. దాడి విషయాన్ని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదన్నాడు. తనపైనే అక్రమంగా కేసు పెట్టించినట్లు కన్నీరు పెట్టుకున్నాడు. సమీర్‌లాగే డబ్బుల కోసం చెప్పులరిగేలా తిరుగుతున్న ఓనర్‌ కం డ్రైవర్లు మరికొందరు ఇబ్బందులు పడుతున్నారు.

■ ప్రభుత్వ సుమో వాహనాన్ని మెడికల్‌ కళాశాలలో ఓ మూలన ఉంచారు. ఈ వాహనానికి ఉపయోగించాల్సిన డీజిల్‌ కూపన్లను అద్దెపై పెట్టిన జూనియర్‌ అసిస్టెంట్‌ వినోద్‌ వాహనానికి వాడారు. పైగా వినోద్‌ వాహనానికి ప్రతి నెల రూ.33వేలు బిల్లులు డ్రా చేస్తున్నారు. మూలన ఉన్న ప్రభుత్వ వాహనానికి తరచూ స్పేర్‌ పార్టులు, మరమ్మతుల బిల్లులు డ్రా చేస్తున్నారు.

■ జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌ ప్రతిమారాజ్‌ పలు అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు పలువురు గతంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఫిర్యాదులు చేశారు. దీంతో వారు ప్రతిమారాజ్‌ను ఈ స్థానంలో నుంచి తొలగించాలని మంత్రి దామోదర రాజనర్సింహకు తేల్చిచెప్పారు. ఈ క్రమంలో సయ్యద్‌ ఖైసర్‌ అనే వ్యక్తి జిల్లా కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతుకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్‌ విచారణ కోసం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ అంకిత్‌ను విచారణాధికారిగా నియమించారు. జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌ వ్యవహారాలకు సంబంధించి 'సాక్షి'లో 'సూపరింటెండెంట్‌ వచ్చేనా!', కోవిడ్‌ సమయంలో రెమిడిసివిర్‌లు పక్కదారి పట్టిన అంశంపై, సమాచార హక్కు చట్టం కింద వివరాలు అడిగినవారిపై కేసులు పెట్టిన విషయమై 'జీజీహెచ్‌లో సొంత రూల్స్‌', వైద్య సేవల లోపాలపై 'ఇలా వచ్చి.. అలా వెళతారు' 'రోగుల సమస్యలు గాలికి', టెండర్లు లేకుండా పనులు చేయడంపై 'మీరు డాక్టరా.. ఇంజినీరా?' అనే కథనాలను ప్రచురించింది. ఈ కథనాలను కొత్త ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పరిగణనలోకి తీసుకోవడం గమనార్హం.

ఉద్యోగిని విధుల్లోకి రానీయకపోవడం..

నిజామాబాద్‌కు చెందిన మహ్మద్‌ ఇస్సాక్‌ 1973లో ధర్పల్లి పీహెచ్‌సీలో హెల్త్‌ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరాడు. 1985 వరకు రెగ్యులర్‌గా విధులు నిర్వహించాడు. తర్వాత నాలుగేళ్ల పాటు విధులకు గైర్హాజరయ్యాడు. ఐదో ఏట రీజాయినింగ్‌కు ఇస్సాక్‌ 1990 మార్చిలో లెటర్‌ పెట్టుకున్నాడు. అప్పటి డీఎంహెచ్‌వో ఇస్సాక్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకుని, విధుల్లోకి తీసుకోవాలని ధర్పల్లి సీహెచ్‌సీకి ఆదేశాలు ఇచ్చారు. అయితే ధర్పల్లి సీహెచ్‌సీలో చేర్చుకోలేదు. విచిత్రమేమిటంటే ఇస్సాక్‌ను విధుల్లోకి చేర్చుకున్నట్లు అప్పటి ధర్పల్లి మెడికల్‌ ఆఫీసర్‌ వాజిదుల్‌ ఖాద్రి డీఎంహెచ్‌వోకు లెటర్‌ పంపారు. ఇస్సాక్‌ పేరిట జీతం డ్రా చేయడం ప్రారంభమైంది. 2005లో ఇస్సాక్‌ చనిపోయేవరకు ఏకంగా 15 ఏళ్లపాటు జీతం డ్రా కాగా, అతన్ని విధుల్లో మాత్రం చేర్చుకోకపోవడం విశేషం. 2000లో ఇస్సాక్‌ భార్య అజీజున్నీసాబేగం తన భర్తకు ఆరోగ్యం బాగా లేక బెడ్‌ రెస్ట్‌లో ఉన్నట్లు ఒక లెటర్‌ ఇచ్చింది. అయినా ఎవరూ పట్టించుకోలేదు. 2004లో తనను విధుల్లోకి తీసుకోవాలని ఇస్సాక్‌ లెటర్‌ పెట్టుకున్నాడు. 2005 డిసెంబర్‌ 9న ఇస్సాక్‌ మృతి చెందాడు. దీంతో రావాల్సిన బెనిఫిట్స్‌ కోసం అజీజున్నీసాబేగం 2006లో దరఖాస్తు చేసుకుంది. ఈ క్రమంలో మరో మాయాజాలం వెలుగు చూసింది. ఇస్సాక్‌ నిజామాబాద్‌లోనే మరణించినట్లు ఫేక్‌ డెత్‌ సర్టిఫికెట్‌ సృష్టించారు. 57 ఏళ్ల వయస్సును 65 సంవత్సరాలుగా నమోదు చేయడం గమనార్హం. ఇదిలా ఉండగా కామారెడ్డి ఆస్పత్రిలో ఇస్సాక్‌ మరణించినట్లు ఇచ్చిన ఒరిజినల్‌ డాక్యుమెంట్‌ను సైతం 2008లో డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాయం చేశారు.

సర్వీస్‌ బుక్‌ మాయం..

2012లో ధర్పల్లి సీహెచ్‌సీలో ఇస్సాక్‌ పేరిట సీనియర్‌ అసిస్టెంట్‌ రాధాకిషన్‌ పెన్షన్‌ ఫైల్‌ తయారు చేశారు. 2013లో సదరు పెన్షన్‌ ఫైల్‌ ధర్పల్లి సీహెచ్‌సీకి రిటర్న్‌ పంపారు. 2015లో రాధాకిషన్‌ మరణించాడు. కాగా 2015 నుంచి ఇస్సాక్‌ కుమారుడు ఫారూక్‌ డిగ్రీ పూర్తి కావడంతో తండ్రి ఉద్యోగ బెనిఫిట్స్‌ కోసం ప్రయత్నాలు చేశాడు. 2022లో ప్రస్తుత డీఎంహెచ్‌వోను కలిశాడు. 2013లో ధర్పల్లి సీహెచ్‌సీకి రిటర్న్‌ పంపిన పెన్షన్‌ ఫైల్‌ను, అదేవిధంగా 2014లో ధర్పల్లి సీహెచ్‌సీ నుంచి డీఎంహెచ్‌వోకు సబ్మిట్‌ చేసిన ఫైల్‌ను అడిగాడు. అది ఇవ్వకపోగా 2004లో ఇస్సాక్‌ పెట్టుకున్న లెటర్‌ కూడా లేదని డీఎంహెచ్‌వో తెలిపారు. మరోవైపు ఇస్సాక్‌ రీజాయినింగ్‌ లెటర్‌ తన కార్యాలయంలో ఉన్నట్లు డీఎంహెచ్‌వో 2022 జూలైలో వెల్లడించి తీరా అక్టోబర్‌లో తమ వద్ద లేదని తెలపడం గమనార్హం. అదేవిధంగా 2022 నవంబర్‌లో ఇస్సాక్‌ సర్వీస్‌ రికార్డు పుస్తకం తమ వద్ద ఉందని, స.హ చట్టం కింద అడిగిన అతని కుమారుడు ఇస్సాక్‌కు చూపించిన డీఎంహెచ్‌వో పోస్టు ద్వారా పంపుతానని చెప్పారు. తీరా 2023 జనవరిలో తమ వద్ద సర్వీస్‌ బుక్‌ లేదని తెలిపారు. దీంతో ఫారూక్‌ గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కలెక్టర్‌ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో ఎం సుదర్శనంపై నిజామాబాద్‌ రూరల్‌ పోలీసులు కేసు నమోదు చేశారు.

లక్ష మెజారిటీ సాధిస్తాం



మాట్లాడుతున్న కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి. పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

- కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

సుభాష్‌నగర్‌/నిజామాబాద్‌రూరల్‌: నిజామాబాద్‌ ఎంపీగా లక్ష మెజారిటీతో విజయం సాధిస్తానని కాంగ్రెస్‌ అభ్యర్థి, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం నగర శివారులోని నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్లమెంట్‌ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కార్యకర్తలు, నాయకులతో సన్నాహక సమావేశం జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో చేరారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో ఇండియా కూటమి ఏర్పడటం ఖాయమన్నారు. పసుపు బోర్డు ప్రకటించి ఆరునెలలు గడిచినా ఏర్పాటు ఎక్కడ అంటూ ప్రశ్నించారు. బీజేపీ నాయకులు శ్రీరాముడి పేరుతో రాజకీయాలు చేస్తూ ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. అర్వింద్‌ ఏం చేశాడో.. ఏం చేస్తాడో చెప్పడం లేదన్నారు. నిజాం షుగర్‌ ఫ్యాక్టరీలు, సారంగాపూర్‌ సహకార చక్కెర ఫ్యాక్టరీని తెరిపించే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. గల్ఫ్, బీడీ కార్మికుల కోసం బీజేపీ ప్రభుత్వం ఏం చేసిందో అర్వింద్‌ చెప్పాలని ప్రశ్నించారు.

బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రంలో కరువు

రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌తోనే కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదని బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. మోదీ అన్ని వ్యవస్థలను నాశనం చేశారని, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు స్వార్థపరులు, దోపిడీదారులని ఆరోపించారు.

కేసీఆర్‌ జైలుకెళ్లడం ఖాయం

త్వరలో కేసీఆర్‌ జైలుకెళ్లడం ఖాయమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్‌ షబ్బీర్‌ అలీ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ నామరూపం లేకుండా పోతుందని, అర్వింద్‌ డీఎన్‌ఏ కాంగ్రెస్‌దన్నారు. కాంగ్రెస్‌ మిగులు బడ్జెట్‌తో ప్రత్యేక రాష్ట్రాన్ని ఇస్తే.. కేసీఆర్‌ అంతా దోచుకుని ఖాళీ చిప్పను తిరిగి కాంగ్రెస్‌ చేతిలో పెట్టారన్నారు.

అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ఎంపీ అర్వింద్‌ ఐదేళ్లలో చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి డిమాండ్‌చేశారు. పసుపు బోర్డు పేరుతో ఓట్లు దండుకుని మోసం చేశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌కు అభ్యర్థులు దొరకడం లేదని, బలవంతంగా బాజిరెడ్డిని బరిలోకి దించారని ఆరోపించారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

నిజామాబాద్‌ పార్లమెంట్‌ నియోజకవర్గ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ధర్మపురి ఎమ్మెల్యే, విప్‌ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ అన్నారు. మచ్చలేని నాయకుడైన జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

దుర్మార్గమైన పాలన

దేశంలో, రాష్ట్రంలో పదేళ్లు దుర్మార్గమైన పాలన సాగిందని కాంగ్రెస్‌ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కి గౌడ్‌ విమర్శించారు. కవిత లిక్కర్‌ స్కామ్‌లో తీహార్‌ జైల్లో ఉందని, సారాతో ముత్యాన్ని కడుగుతుందేమో అని ఎద్దేవాచేశారు. మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, ఆకుల లలిత, ఆర్మూర్‌ బాల్కొండ, కోరుట్ల ఇన్‌చార్జ్‌లు వినయ్‌రెడ్డి, సునీల్‌కుమార్‌ రెడ్డి, జువ్వాడి నర్సింగ్‌రావు, కార్పొరేషన్‌ చైర్మన్‌ ఈరవత్రి అనిల్, ఉర్దు అకాడమి చైర్మన్‌ తాహెర్‌బిన్‌హుందాన్, అన్వేష్‌రెడ్డి, మానాల మోహన్‌రెడ్డి, జగిత్యాల్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ జ్యోతి మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్‌ కుంట రమేశ్‌ రెడ్డి, మాజీ మేయర్‌ ఆకుల సుజాత, ఆర్మూర్‌ మాజీ చైర్‌పర్సన్‌ స్వాతిసింగ్‌ బబ్లూ, శేఖర్‌ గౌడ్, జెడ్పీ వైస్‌ చైర్మన్‌ రజితాయాదవ్, తూము పద్మా, విజయలక్ష్మి, లావణ్య, కొమ్‌రెడ్డి కరణ్, కెతావత్‌ యాదగిరి, వేణురాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ పోటీయే కాదు

జీవన్‌రెడ్డికి బీజేపీ, బీఆర్‌ఎస్‌ పోటీయే కాదని ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌ గౌడ్‌ పేర్కొన్నారు. జీవన్‌రెడ్డి పేరు ప్రకటించిన వెంటనే ఆయన విజయం ఖాయమైందన్నారు. అర్వింద్‌ ఎంపీగా ఏనాడూ జిల్లా సమస్యలపై ప్రస్తావించలేదన్నారు. బీఆర్‌ఎస్‌లో తండ్రి, కొడుకులు తప్ప ఎవరూ మిగలరని, హరీశ్, కవిత కూడా బీజేపీలోకి వెళ్తారన్నారు.

ప్రలోభాలకు తావివ్వొద్దు

- గట్టి నిఘా ఏర్పాటు చేయాలి
- కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్‌: లోక్‌సభ ఎన్నికల్లో ప్రలోభాలకు అవకాశం లేకుండా సంబంధిత అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన ఇంటెలిజెన్స్‌ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో వ్యయ నియంత్రణ ప్రధాన అంశమని, ప్రతి ఖర్చును లెక్కించవలసి ఉంటుందన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే డబ్బు, మద్యం, కానుకలు, మత్తు పదార్థాలు తదితర వాటిపై నిఘా ఉంచాలని ఆదేశించారు. ఫ్లయింగ్‌ స్క్వాడ్, వీడియో సర్వేలైన్స్, స్టాటిస్టికల్‌ సర్వేలెన్స్‌ బృందాలు, సెక్టోరల్‌ అధికారులు సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. ఆబ్కారీ, రవాణా, వాణిజ్య పన్నులు తదితర శాఖల సిబ్బందితో ఇంటిగ్రేటెడ్‌ చెక్‌ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, రూ.10 లక్షలు పైగా నగదు దొరికితే ఆదాయ పన్ను శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. తనిఖీలకు సంబంధించిన వివరాలను నిర్ణీత నమూనాలో రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. అనుమానాస్పద బ్యాంకు లావాదేవీలపై రోజు వారీగా నివేదిక అందించాలని, ఎక్కువ మొత్తంలో నగదు బదిలీ జరిగే ఖాతాలను గుర్తించి వివరాలు సమర్పించాలని లీడ్‌ బ్యాంకు మేనేజర్‌ శ్రీనివాస్‌రావును ఆదేశించారు. అక్రమ మద్యం నిల్వలు, మద్యం రవాణాపై దాడులు చేయాలని ఆబ్కారీ అధికారులకు సూచించారు. ఆర్టీసీ బస్సుల్లో కార్గో సేవలు, రైల్వే ద్వారా వస్తువులను ఎన్నికల ప్రలోభాల కోసం పంపిస్తున్నారనే అనుమానం కలిగితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆర్టీసీ, రైల్వే అధికారులకు సూచించారు. సీపీ కల్మేశ్వర్‌ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్‌ వెలువడిన నాటి నుంచి విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్‌ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్‌ మకరంద్, ట్రెయినీ కలెక్టర్‌ కిరణ్మయి పాల్గొన్నారు.

ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలి



సీఎంసీ కళాశాల కౌంటింగ్‌ కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

డిచ్‌పల్లి: నిజామాబాద్‌ పార్లమెంట్‌ ఎన్నికల నిర్వహణకు సంబంధించి డిచ్‌పల్లి సీఎంసీ కళాశాలలో కౌంటింగ్‌ ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. సీఎంసీ కళాశాలలో ఓట్ల లెక్కింపు చేపట్టనుండగా, ఈ మేరకు కౌంటింగ్‌ కోసం చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్‌ శనివారం పరిశీలించారు. పార్లమెంట్‌ నియోజకవర్గ పరిధిలోని ఓట్ల లెక్కింపు ఇక్కడ నిర్వహించనున్నారు. అలాగే నిజామాబాద్‌ అర్బన్, రూరల్‌ అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కూడా సీఎంసీలోనే చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్‌ సెంటర్లను, ఆయా సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు గదులు, పోలింగ్‌ ముగిసిన అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద చేపడుతున్న ఏర్పాట్లు, వసతులను కలెక్టర్‌ పరిశీలించారు. స్ట్రాంగ్‌ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాల నిఘాలో నిరంతరం పర్యవేక్షణ జరపాలన్నారు. అన్ని చోట్ల విద్యుత్‌ వసతి, ఫ్యాన్లు, లైట్లు పని చేస్తున్నాయా లేదా అన్నది పక్కాగా నిర్ధారణ చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఈ రాజశేఖర్‌ను ఆదేశించారు. జనరేటర్‌ సదుపాయాన్ని కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. స్ట్రాంగ్‌రూంలలో ఫైర్‌ అలారమ్‌లను అమర్చాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మురళి మనోహర్‌ రెడ్డిని ఆదేశించారు. అదనపు కలెక్టర్‌ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్‌ మకరంద్, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, ఏసీపీ రాజావెంకట్‌ రెడ్డి, ఆర్డీవోలు రాజాగౌడ్, రమేష్‌రాథోడ్, కార్మిక శాఖ అధికారి యోహాన్, విజయేందర్‌ రెడ్డి, మెప్మా పీడీ రాజేందర్‌ ఉన్నారు.

అవిశ్వాసం నెగ్గింది..

- కలెక్టర్‌ సమక్షంలో కామారెడ్డి బల్దియాలో సమావేశం
- తీర్మానానికి అనుకూలంగా ఓటేసిన 37 మంది కౌన్సిలర్లు

సాక్షి కామారెడ్డి/కామారెడ్డి టౌన్‌: కామారెడ్డి బల్దియాలో నాలుగేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనకు తెరపడింది. ఆ పార్టీ చెందిన చైర్‌పర్సన్‌ నిట్టు జాహ్నవిపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గింది. ఆమెకు వ్యతిరేకంగా కాంగ్రెస్‌ కౌన్సిలర్లతో పాటు.. సొంత పార్టీ కౌన్సిలర్లు ఓటు వేయడంతో జాహ్నవి పదవిని కోల్పోవాల్సి వచ్చింది. ఈనెల 11వ తేదీన 27 మంది కాంగ్రెస్‌ కౌన్సిలర్లు అవిశ్వాసం కోరుతూ సంతకాలు చేసి కలెక్టర్‌కు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు శనివారం కామారెడ్డి మున్సిపల్‌ కార్యాలయంలో కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్, మున్సిపల్‌ కమిషనర్‌ సుజాతల సమక్షంతో అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించారు. కౌన్సిల్‌లో 49 మంది సభ్యులుండగా.. అవిశ్వాసం నెగ్గడానికి 34 మంది సభ్యుల కోరం అవసరం ఉంది. అయితే ఈ అవిశ్వాస సమావేశానికి 37 మంది సభ్యులు హాజరై తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశారు. దీంతో అవిశ్వాసం నెగ్గిందని అధికారులు ప్రకటించారు. అవిశ్వాసం నెగ్గడంలో తీర్మానం, 37 మంది సభ్యుల సంతకాల పత్రాలను ప్రభుత్వానికి, మున్సిపల్‌ శాఖకు పంపించినట్లు కమిషనర్‌ సుజాత తెలిపారు. ప్రభుత్వం నుంచి గెజిట్‌ రావాల్సి ఉందన్నారు. చైర్‌పర్సన్‌ ఎన్నిక ప్రక్రియ ఆలస్యమైతే వైస్‌ చైర్‌పర్సన్‌ను ఇన్‌చార్జిగా నియమించే అవకాశాలున్నాయి. చైర్‌పర్సన్‌ రేసులో ఉర్దోండ వనిత, వైస్‌ చైర్‌పర్సన్‌ ఇందుప్రియ ఉన్నారు.

క్లుప్తంగా

ముగిసిన బీపీఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీపీఈడీ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు శనివారం ముగిసినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షాకేంద్రంలో నిర్వహించిన పరీక్షలకు మొత్తం 81 మంది విద్యార్థులకుగాను 77 మంది హాజరు కాగా, నలుగురు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

'ఓపెన్' ప్రవేశానికి నేటితో ముగియనున్న గడువు

నిజామాబాద్‌అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ఆదివారం(నేడు)తో గడువు ముగియనున్నట్లు రీజినల్ కో ఆర్డినేటర్ రంజిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ ఎంపీసీ, పీజీలో ఎంఏ, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, జర్నలిజం కోర్సులు తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలో అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఎంకాం, ఎమ్మెస్సీ సైకాలజీ, మ్యాథమెటిక్స్ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఒరిజినల్ సర్టిఫికెట్ తోపాటు ఒక జిరాక్స్ కాపీని అధ్యయన కేంద్రంలో అందజేయాలని, మిగతా వివరాలకు 73829 29612 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నగరంలో కత్తులతో వీరంగం

- పాతకక్షల నేపథ్యంలో దాడి!

ఖలీల్ వాడి: నగరంలోని నాల్గోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి పలువురు కత్తులతో వీరంగం సృష్టించారు. బాధితులు సిరికొండ శంకర్, పోసాని, గోపాల్, మీన తెలిపిన వివరాల ప్రకారం.. సెల్‌ఫోన్ చోరీ జరిగిందని శుక్రవారం మధ్యాహ్నం బాధితులకు, ప్రసాద్ అనే వ్యక్తికి గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో ప్రసాద్ అతడి బంధువులైన మల్లేశ్, దశరథ్, సాయిలు, గంగామణి, బన్నీ, భార్గవ్, లక్ష్మణ్, రాజవ్వతో కలిసి బోర్గాం(పి) పరిధిలోని సత్యనారాయణస్వామి ఆలయం సమీపానికి కత్తులతో వచ్చారు. శంకర్‌తోపాటు అతడి తల్లి పోసాని, తమ్ముడు గోపాల్, అక్క మీనపై దాడి చేశారు. పాతకక్షలను దృష్టిలో పెట్టుకొని తమపై దాడి చేశారని బాధితులు తెలిపారు. గాయాలపాలైన వారు ప్రస్తుతం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్

- ఆన్‌లైన్ ఫారం–12 నమోదుకు ప్రత్యేకాధికారి
- రిటర్నింగ్ అధికారి స్థాయిలో పోస్టల్ బ్యాలెట్ ముద్రణ
- వీడియోకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది ప్రతి ఒక్కరికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. శనివారం జిల్లా ఉన్నతాధికారులతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అందించేందుకు అదనపు ఫారం–12 సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించే సమయంలో అవసరమైన మేర కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఫారం–12 అందజేసి ఉద్యోగి ఆప్షన్ తీసుకోవాలని సూచించారు. సిబ్బంది ఇచ్చిన ఆప్షన్ ప్రకారం ఎస్ఎంఎస్ వెళ్తుందని, ఓటుహక్కు వినియోగించుకునేందుకు సిబ్బందికి ప్రత్యేక సాధారణ సెలువు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఉద్యోగుల నుంచి ఫారం–12 తీసుకొని ఆన్ లైన్‌లో నమోదు చేసేందుకు ప్రత్యేకాధికారిని కేటాయించాలని ఆదేశించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ఫారం–12 సంబంధిత పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల వద్దకు వెళ్తాయని తెలిపారు. ఏప్రిల్ 29 నాటికి పోటీచేసే అభ్యర్థుల జాబితాను రిటర్నింగ్ అధికారులు సమర్పించాల్సి ఉంటుందని, ఫారం–7ఏను సీఈవో కార్యాలయం ధ్రువీకరించిన తర్వాత ఏప్రిల్ 30 నుంచి మే 1 వరకు రిటర్నింగ్ అధికారి స్థాయిలో పోస్టల్‌బ్యాలెట్‌ను ప్రింట్ చేయాలన్నారు. అత్యవసర సేవల్లో పాల్గొనే సిబ్బందికి సైతం ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించిందని, కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన రవాణాసేవలు, మీడియా, విద్యుత్, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, టెలిగ్రామ్, ఆర్టీసీ, అగ్నిమాపక సేవలు, ట్రాఫిక్, పోలీస్ తదితర అత్యవసర శాఖల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్స్ సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. 85 సంవత్సరాలు పైబడి పూర్తిగా నడవలేని సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, కొవిడ్ పేషెంట్లు ఇంటినుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ఇంటి వద్దనుంచి ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే వారు ఏప్రిల్ 23వ తేదీలోగా ఫారం–12డీ సమర్పించాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం


అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తిన సభ్యులు

డిచ్‌పల్లి: మండల పరిషత్ అధ్యక్షుడు గద్దె శ్రీనివాస్ అలియాస్ భూమయ్యపై సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 3.30గంటలకు నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మాన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. మొత్తం 17 మంది ఎంపీటీసీలకుగాను 13 మంది హాజరై అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో ప్రకటించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్డీవో రాజేంద్రకుమార్ మాట్లాడుతూ.. జనవరి 8న డిచ్‌పల్లి ఎంపీపీ, వైస్ ఎంపీపీపై 12 మంది ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం కోరుతూ దరఖాస్తు అందజేశారన్నారు. అనంతరం ఎంపీపీ గద్దె భూమయ్య హైకోర్టును ఆశ్రయించగా కోర్టు స్టే ఇచ్చిందని తెలిపారు. దీంతో వైస్ ఎంపీపీపై మాత్రమే అవిశ్వాసం ప్రవేశపెట్టగా శ్యాంరావు పదవిని కోల్పోయారని ఆర్డీవో తెలిపారు. ఆ తరువాత మార్చి 13న హై కోర్టు స్టే ఎత్తివేయడంతోపాటు ఏప్రిల్ 2వ తేదీలోగా అవిశ్వాస సమావేశాన్ని నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో మార్చి 30న అవిశ్వాస సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ సభ్యులకు నోటీసులు జారీ చేసి ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. అవిశ్వాస సమావేశం నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. జెడ్పీ సీఈవో ద్వారా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు నివేదిక పంపించి తిరిగి ఆదేశాలు వచ్చిన తర్వాత ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులకు ఎన్నిక నిర్వహిస్తారని ఆర్డీవో తెలిపారు. సమావేశం సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ మల్లేశ్ ఆధ్వర్యంలో డిచ్‌పల్లి, ఇందల్వాయి, జక్రాన్‌పల్లి ఎస్సైలు యూ మహేశ్, మనోజ్‌కుమార్, తిరుపతి తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

సమావేశానికి హాజరుకాని ఎంపీపీ

తనపై ఇచ్చిన అవిశ్వాసం నెగ్గే అవకాశం ఉందని స్పష్టం కావడంతో సమావేశానికి ఎంపీపీ గద్దె భూమన్న హాజరు కాలేదు. అయనతోపాటు బీజేపీలో కొనసాగుతున్న వైస్ ఎంపీపీ కులాచారి శ్యాంరావు, సుద్దపల్లి ఎంపీటీసీ ఎంబడి సంతోషం, డిచ్‌పల్లి ఎంపీటీసీ కొత్తూరు మానస సమావేశానికి గైర్హాజరయ్యారు. అవిశ్వాసం నెగ్గడంతో మండల పరిషత్ కార్యాలయం బయటకు వచ్చిన ఎంపీటీసీలు , కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకోవాలని ఏర్పాట్లు చేస్తుండగా, ఎన్నికల కోడ్ అమలులో ఉందని పోలీసులు వారించడంతో వారంతా అక్కడినుంచి వెళ్లిపోయారు.

కథాసదస్సులో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో ఉపాధ్యాయులు

నిజామాబాద్‌రూరల్: కెనడా దేశం కేంద్రంగా తెలుగుతల్లి, గడుగ్గాయి పత్రికల సౌజన్యంతో నిర్వహించిన 'ఊ కొడతారా! బుజ్జాయిల కథలు' శీర్షికతో ఆన్‌లైన్ నిర్వహించిన కథాసదస్సులో గుండారం విద్యార్థులు కథలను వినిపించి ప్రతిభచాటారు. మొత్తం 10 దేశాల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గుండారం పాఠశాల విద్యార్థులు లాస్య (శూర్పనఖ), కృష్ణవేణి (జటాయువు), ఇందు (చేసిన తప్పు), శ్రీవేణి (సింహం చిట్టెలుక), మధు మీనాక్షి (కోడిపుంజు), సాయిహర్షిత (సాధువు), నిహారిక(సీతాస్వయంవరం), శృతిరెడ్డి (మితిమీరిన ఆశ), స్పందన (రాజు), సంజన (తెలివైన రైతు), అశ్విని (గర్వం పనికి రాదు) కథలను వినిపించారు. విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్పష్టమైన ఉచ్చారణ, చక్కని భావవ్యక్తీకరణ, హావభావాలను సమర్థవంతంగా పలికించిన విద్యార్థులను కెనడాలోని నిర్వాహకులు రాయవరపు లక్ష్మి, ఉదయశ్రీతోపాటు హెచ్‌ఎం బి.అమర్‌నాథ్, ఉపాధ్యాయులు కాసర్ల నరేశ్‌రావు, వారె దస్తగిరి, శ్రీపాద్‌ను అభినందించారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సంజీవ్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. వినాయక్‌నగర్‌లోని రుక్మిణి చాంబర్ వద్ద ఆటోలో నుంచి దిగుతున్న వృద్ధురాలి మెడలో నుంచి దుండగులు బంగారు గొలుసు లాక్కెళ్లారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడింది ఆర్మూర్ మండలం పిప్రికి చెందిన వితల ప్రవీణ్, అల్లరి ప్రశాంత్‌గా గుర్తించారు. వారి నుంచి బంగారం, బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

సజ్జలో కత్తెరపురుగును నివారించాలి

- ఆలూర్‌లో పంటను పరిశీలించిన వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు


సజ్జను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్, శాస్త్రవేత్తలు

పెర్కిట్(ఆర్మూర్): సజ్జ పంటను కత్తెర పురుగు ఆశించిందని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో రైతులు సాగు చేస్తున్న సజ్జను రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సజ్జ ప్రస్తుతం 40 నుంచి 50 రోజుల శాఖీయ దశలో ఉందని, ఈ దశలో పంటను కత్తెర పురుగు ఉధృతంగా ఆశించిందన్నారు. కత్తెర పురుగు వేడి వాతావరణంలో గుడ్డు, లద్దె పురుగు, రెక్కల పురుగు దశల జీవిత చక్రాన్ని ముగించుకుని విచ్చలవిడిగా పంటను ఆశించి నష్ట పరుస్తుందన్నారు. వారివెంట ఏడీఏ విజయలక్ష్మి, ఏవో హరికృష్ణ, రాజ్ కుమార్, ఏఈవో వసుదాం, రైతులు పాల్గొన్నారు.

నివారణ చర్యలు

రుద్రూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త టీ విజయ్ కుమార్ సజ్జ పంట సస్యరక్షణ చర్యలు, కత్తెర పురుగునివారణకు పలు సూచనలు చేశారు.

- విత్తే ముందు కిలో విత్తనాలకు ఆరు మిల్లీ లీటర్ల సయంత్రనిలిప్రోల్ మందును థయోమిథాక్సిన్ మందుతో కలిపి శుద్ధి చేయాలి.
- శాఖీయ దశలో ఎకరానికి 10 నుంచి 12 లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేయాలి.
- ఇసుక, సున్నాన్ని 9:1 నిష్పత్తిలో కలిపి మోగి సుడులలో వేస్తే పురుగు ఉధృతి తగ్గుతుంది.
- పంటలో బాగా ఎదిగిన లార్వాలను గమనిస్తే.. 10 కిలోల తవుడు, 2 కిలోల బెల్లాన్ని రెండు లీటర్ల నీటిలో కరిగించి 12 నుంచి 14 గంటలు పులియబెట్టి వాడాలి.
- పంటలను వేసుకోవడానికి అరగంట ముందు మిశ్రమానికి 100 గ్రాముల పొడి థయోమిథాక్సిన్ మందుతో కలిపి ఉండలుగా తయారు చేసుకున్న విషపు ఎరలను సాయంత్రం వేళలో మోగి సుడులలో వేయాలి.
- సస్యరక్షణ చర్యలు పాటించిన అనంతరం పురుగు ఉధృతికి అనుగుణంగా రసాయన మందులైన 0.4 ఎంఎల్ క్లోరాంత్రనిలిప్రోల్ లేదా 0.5 ఎంఎల్ సైన టోరమ్ లీటర్ నీటికి లేదా 0.25 ఎంఎల్ థయోమిథాక్సిన్ మందును లామ్డా సైహలోత్రిన్‌తో లీటరు నీటికి కలిపి మొక్క సుడులలో పడేటట్లు పిచికారీ చేయాలి.

ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ తప్పదు



ఖలీల్ వాడి: ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ తప్పదని, పోలీసుశాఖలో విధులు నిర్వర్తించిన ఆఫీస్ సూపరింటెండెంట్ దోమెవార్ గోవింద్, కంట్రోల్ రూమ్ ఎస్సై జి శ్యామ్‌సుందర్ రావు, ఆరోటౌన్ ఎస్సై ఎన్ గణేశ్‌సర్వీస్‌లో ఎలాంటి రిమార్క్ లేకుండా పని చేశారని సీపీ కల్మేశ్వర్ అన్నారు. ముగ్గురు అధికారులు శనివారం పదవీవిరమణ పొందగా, సీపీ వారిని కమిషనరేట్ కార్యాలయంలో సన్మానించి వీడ్కోలు పలికారు. స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్ పాల్గొన్నారు.

గ్రౌండ్ వాటర్ డీడీకి సన్మానం..



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) దేవేంద్ర ప్రసాద్ పదవీవిరమణ పొందారు. శాఖ ఉద్యోగులు శనివారం వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి దేవేంద్రప్రసాద్ దంపతులను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. 35 సంవత్సరాల పాటు వివిధ శాఖల్లో పని చేసిన దేవేంద్ర ప్రసాద్ నిజామాబాద్ గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్‌లో దాదాపు ఆరేళ్ల పాటు ఉప సంచాలకులుగా విధులు నిర్వర్తించారు. జిల్లా గ్రౌండ్ వాటర్ డీడీగా నిర్మల్ జిల్లా అధికారి శ్రీనివాస్ బాబుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన త్వరలో బాధ్యతలు తీసుకోనున్నారు.

అలరించిన టెక్‌ట్రానికా ఫెస్ట్



నిజామాబాద్‌అర్బన్: కాకతీయ ఒలంపియాడ్ పాఠశాల ఆధ్వర్యంలో నగరంలోని శ్రీరామగార్డెన్స్‌లో శనివారం ప్రారంభమైన టెక్‌ట్రానికా రోబోటిక్ ఫెస్ట్ అలరించింది. ఫెస్ట్ రెండురోజులపాటు కొనసాగనుంది. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులు వివిధ ప్రదర్శనలను రూపొందించి ప్రదర్శించారు. వివిధ రంగాల్లో నూతన ఆవిష్కరణలు, ఆయా సమస్యలకు పరిష్కారాలను చూపుతూ మొత్తం 378 ప్రదర్శనాలు ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఫెస్ట్ కొనసాగింది. కార్యక్రమంలో కాకతీయ ఒలంపియాడ్ పాఠశాల డైరెక్టర్ రజినీకాంత్, ప్రిన్సిపల్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్ప్రాజోలం పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవీందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెంగారం గ్రామంలో ఉన్న కల్లుదుకాణం, డిపోపై ఎస్సై చైతన్యకుమార్ సిబ్బందితో కలిసి శనివారం దాడిచేసి రెండు గ్రాముల నిషేధిత అల్ప్రాజోలంను పట్టుకున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. లింగంపేట పోలీస్‌స్టేషన్‌లో శనివారం సాయంత్రం వివరాలను వెల్లడించారు. మెంగారంలో కల్తీకల్లు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి అల్ప్రాజోలం పట్టుకున్నారు. కల్లు డిపో నిర్వాహకుడు గోవర్ధన్‌గౌడ్‌పై నార్కొటిక్స్ డ్రగ్స్(ఎన్‌డి) యాక్టు కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టుబడిన అల్ప్రాజోలం విలువ రూ.40వేలు ఉంటుందని, ఐదు కల్లు సీసాలను సీజ్ చేసి ల్యాబ్‌కు పంపించామని సీఐ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు కల్లు దుకాణాల తనిఖీ చేపట్టామన్నారు. ఎల్లారెడ్డి సర్కిల్ పరిధిలోని నాగిరెడ్డిపేట, లింగంపేట, ఎల్లారెడ్డి మండలాల్లో ఇప్పటి వరకు ఆరు కల్తీకల్లు కేసులు నమోదైనట్లు వెల్లడించారు. సర్కిల్ పరిధిలో కల్లు వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే సహించేదిలేదన్నారు. చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో హెడ్‌కానిస్టేబుల్ రాజేందర్, ఐడీ పార్టీ కానిస్టేబుల్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.7.45లక్షల నగదు సీజ్



ఖలీల్‌వాడి/మాచారెడ్డి/నస్రుల్లాబాద్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి తరలిస్తున్న నగదును సీజ్ చేస్తున్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఓ ఫైనాన్స్ వ్యాపారి నుంచి రూ.4.08 లక్షల నగదు సీజ్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. మాచారెడ్డి మండలం ఘన్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద రూ.2.71లక్షలు, నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద రూ.66వేలను సీజ్ చేశారు. తనిఖీల్లో మాచారెడ్డి, నస్రుల్లాబాద్ ఎస్సైలు శ్రీనివాస్‌గౌడ్, లావణ్య, ఘన్‌పూర్ చెక్ పోస్ట్ అధికారి విద్యాసాగర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరి బైండోవర్..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇద్దరు పాత నేరస్తులను తహసీల్దార్ రామలింగేశ్వర్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై గంగాధర్ శనివారం తెలిపారు. ముదక్‌పల్లికి చెందిన ముత్తెన్న, మోపాల్‌కు చెందిన రాజారెడ్డిని బైండోవర్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

ఐదుగురిపై కేసులు..

మోపాల్ మండలకేంద్రంలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన వారిని న్యాయమూర్తి ఎదుట సోమవారం హాజరు పరుస్తామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

క్రైం కార్నర్

చేపలవేటకు వెళ్లి మృతి

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత పొతంగల్ చెరువులో చేపల వేటుకు వెళ్లిన అజం మొగులయ్య (56) అనే వ్యక్తి కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఈ నెల 29న ఇంటి నుంచి వెళ్లిన మొగులయ్య తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలిస్తుండగా శనివారం సాయంత్రం చెరువులో మృతదేహం కనిపించింది. మృతుడి భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..

బాన్సువాడ రూరల్: బాన్సువాడ–ఎల్లారెడ్డి రోడ్డులో కొయ్యగుట్ట సమీపంలోని చదలవాగు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాన్సువాడ పట్టణంలోని మదీనా కాలనీకి చెందిన కిరాణావ్యాపారి మహ్మద్ ముఖ్తార్ (48) మృతి చెందారు. వెల్లుట్లలోని తన తమ్ముడి ఇంట్లో శుక్రవారం నిర్వహించిన శుభకార్యానికి భార్య ఆయేషాబేగంతో కలిసి హాజరైన ముఖ్తార్ ద్విచక్రవాహనంపై శనివారం తిరిగి వస్తుండగా బొలేరో వాహనం ఢీకొట్టింది.గాయాలపాలైన భార్యాభర్తలను 108 అంబులెన్స్‌లో ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. స్థానిక వైద్యులు మెరుగైన చికిత్స అందించాలని సూచించడంతో నిజామాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో ముఖ్తార్ మృతి చెందాడు. ఆయేషా చికిత్స పొందుతున్నారు.మృతుడి కుమారుడు మహ్మద్ మతీన్ ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మున్నూరు కృష్ణ తెలిపారు.

తాటిచెట్టు నుంచి పడి యువకుడు..

ఎడపల్లి (బోధన్): మండలంలోని కుర్నాపల్లికి చెందిన మక్కల రాజశేఖర్(33) ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి మృతి చెందినట్లు ఎస్సై వంశీచందర్‌రెడ్డి తెలిపారు. తాటిముంజల కోసం శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో చెట్టెక్కిన రాజశేఖర్ ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. మృతుడి భార్య మక్కల రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టైరుపేలి కారు బోల్తా

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం టైరు పేలి కారు బోల్తాపడింది. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బెంగళూర్‌కు చెందిన ఓ కుటుంబం మధ్యప్రదేశ్‌కు వెళ్లి.. తిరిగి బెంగళూర్‌కు వెళ్తుండగా టైరు పేలి కారు బోల్తాపడింది. కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. గాయాలపాలైన వారికి 108 అంబులెన్స్ సిబ్బంది చికిత్స అందించారు.

టోల్‌ప్లాజాను ఢీకొన్న కంటైనర్



భిక్కనూరు:నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కంటైనర్ వాహనం మండల కేంద్రం సమీపంలోని టోల్‌ప్లాజా క్యాబిన్‌ను శనివారం తెల్లవారుజామున ఢీకొట్టింది. ఈ ఘటనలో టోల్‌ప్లాజాలో విధులు నిర్వర్తిస్తున్న బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం వెంటనే కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బీబీపేట: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. జనగామ గ్రామ శివారులోని ఎడ్లకట్ట వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు జనగామ మర్రి వద్ద తనిఖీలు నిర్వహించి మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత అదృశ్యం

ధర్పల్లి: మండలంలోని రామడుగు గ్రామానికి చెందిన కొట్టం నాగలక్ష్మి అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై విక్రమ్ శనివారం తెలిపారు. తన భర్త, అత్తతో గొడవపడిన నాగలక్ష్మి ఈనెల 28న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయింది. నాగలక్ష్మి గతంలో కూడా పలుమార్లు గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి వచ్చేది. గురువారం ఇంటినుంచి వెళ్లిన ఆమె తిరిగిరాకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో నాగలక్ష్మి భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌ల చోరీలో అరెస్ట్

- 26 వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు
- మూడు జిల్లాల్లో చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్న నిందితులు
- వివరాలు వెల్లడించిన బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ


పోలీసుల అదుపులో నిందితులు

బాన్సువాడ : ఇద్దరు బైక్ దొంగలను అరెస్ట్ చేసి వారినుంచి 26 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బీర్కూర్ కమాన్ చౌరస్తా వద్ద శనివారం ఉదయం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా.. బైక్‌పై అటుగా వచ్చిన ఇద్దరు వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకున్నారు. పట్టుబడిన బోధన్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ అయాజ్‌ఖాన్, మహమ్మద్ సమీర్ ఉద్దీన్ విచారించగా, మద్యానికి బానిసైన తాము నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో ఇళ్ల ముందున్న బైక్‌లను చోరీ చేసి జల్సాలు చేసేవారమని తెలిపారు. బీర్కూర్‌లో చోరీ చేసేందుకు వస్తుండగా పట్టుబడ్డామన్నారు. అబ్దుల్ అయాన్‌ఖాన్‌పై 26, సమీర్ ఉద్దీన్‌పై 26 కేసులు నమోదయ్యాయని డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన బీర్కూర్ ఎస్సై రాజశేఖర్, పిట్లం ఎస్సై నరేశ్, సిబ్బంది వసీ, రఘు, సాయిబాబా, శివ, చరణ్, సంగమేశ్వర్‌ను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న బైక్‌లు